

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



బుధవారం 25-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :156 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

ఆసియాలో భారత్ ఆధిపత్యం!

ఆసియా పవర్ ఇండెక్స్‌లో భారత్‌కు మూడో స్థానం

జపాన్, రష్యాలను వెనక్కి నెట్టిన భారత్

చైనాతో శక్తి అంతరం తగ్గించిన భారత్

ఆసియా నాయకత్వంలో రెండో స్థానానికి మోదీ

విదేశీ పెట్టుబడుల్లో భారత్‌కు రెండో ర్యాంక్

సైనిక సామర్థ్యంలో భారత్‌కు నంబర్ వన్

2050 శ్రామిక శక్తిలోనూ భారత్ అగ్రస్థానం


2 లో

న్యూస్ డెస్క్, 24 నవంబర్ (ఇది కద నిజం): అంతర్జాతీయ వేదికపై భారత్ తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన ప్రఖ్యాత 'లోవీ ఇన్‌స్టిట్యూట్' విడుదల చేసిన 'ఆసియా పవర్ ఇండెక్స్ 2026' నివేదికలో భారత్ 'మేజర్ పవర్' హోదాను మరింత సుస్థిరం చేసుకుంది. అమెరికా, చైనా వంటి అగ్రరాజ్యాల తర్వాత వరుసగా మూడో ఏడాది కూడా మూడో స్థానాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా, జపాన్, రష్యా, ఆస్ట్రేలియా వంటి దేశాలను వెనక్కి నెట్టి ముందంజ వేసింది. ఆసియాలోని 27 దేశాలు, భూభాగాలను 131 ప్రమాణాల ఆధారంగా విశ్లేషించి ఈ ర్యాంకులను ప్రకటించారు.

ఈ ఏడాది సూచీలో భారత్ మొత్తం స్కోరు 40.5 పాయింట్లకు చేరుకుంది. టాప్-10 దేశాల్లో అత్యధికంగా స్కోరు పెంచుకున్న ఏకైక దేశంగా భారత్ నిలవడం విశేషం.

సోనియాకు సావర్కర్ మునిమనవడి నోటీసులు!

సావర్కర్ మునిమనవడి లీగల్ నోటీసు 2 లో

వ్యాఖ్యలపై సత్యకి సావర్కర్ అభ్యంతరం

15 రోజుల్లో స్పందించాలని డిమాండ్

లేదంటే కోర్టుకు వెళ్తామని హెచ్చరిక

రెండు పేజీల్లో వివాదాస్పద వ్యాఖ్యలు

చరిత్రను వక్రీకరించారంటూ ఆరోపణలు

అఖిలేశ్ లెక్కలు.. కాంగ్రెస్‌కు చిక్కులు!

యూపీ ఎన్నికలపై ఎస్పీ-కాంగ్రెస్ పొత్తు చర్చలు

కాంగ్రెస్‌కు 26 సీట్లు ఆఫర్ చేసిన ఎస్పీ

సీట్ల పంపకాలపై తొలి విడత చర్చలు పూర్తి

120 స్థానాలతో కాంగ్రెస్ ప్రతిపాదిత జాబితా

181 స్థానాలపై కాంగ్రెస్ ఆశలు

60-70 సీట్లకే ఎస్పీ మొగ్గు

2027 ఎన్నికలే లక్ష్యంగా పార్టీల కసరత్తు 2 లో

కోమటిరెడ్డికి అధిష్టానం భరోసా!


2 లో

న్యూస్ డెస్క్, 24 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత అసంతృప్తులపై నూతన రాష్ట్ర ఇన్‌ఛార్జ్ బీఎం సందీప్ ప్రత్యేక దృష్టి సారించారు. గత కొంతకాలంగా సొంత ప్రభుత్వాన్ని, పార్టీని ఇరుకున పెట్టేలా బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిలతో ఆయన భేటీ అయ్యారు.

జల జగడం కాంగ్రెస్‌పై గులాబీ గర్జన!



- పల్నాడు ప్రాజెక్టుపై సీఎం ఎదురుదాడి
- బ్యాక్‌డేట్ లేఖలతో తప్పించుకునే యత్నం
- బీఆర్ఎస్ బయటపెడితే.. కాంగ్రెస్ ఉత్తరాలు
- జీవో 56పై రేవంత్ వ్యాఖ్యలకు కౌంటర్
- పాలమూరుకు సీఎం తీరుతో అన్యాయం
- మూడేళ్లలో మూడు కిలోమీటర్ల కాలువ కూడా తవ్వలేదు
- ప్రాజెక్టుల డీపీఆర్‌లు వెనక్కి తీసుకున్న కాంగ్రెస్
- సాగునీటి విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం
- గొంతు పెంచితే అబద్ధాలు నిజాలు కావు

న్యూస్ డెస్క్, 24 నవంబర్ (ఇది కద నిజం): నాగార్జునసాగర్ రిజర్వాయర్ లో ఏపీ చేపడుతున్న పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడ్డంగా దొరికిపోయి తప్పించుకునేందుకు ఎదురుదాడి చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. పల్నాడు ప్రాజెక్టు టెండర్ల వ్యవహారాన్ని పత్రికలు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బయటపెట్టిన తర్వాత ప్రభుత్వం బ్యాక్ డేట్‌తో ఉత్తరాలు రాసిందని ఆరోపించారు. ఈ ప్రాజెక్టుకు 2025 జనవరి 24నే టెండర్లు పిలిచారని, అప్పుడే ముఖ్యమంత్రి ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఇరిగేషన్ మంత్రి సొంత జిల్లాలో ఇంత జరుగుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి సోయి లేదా అని నిలదీశారు. తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు గొంతు పెంచితే సరిపోదని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, పల్నాడు ప్రాజెక్టు వివాదం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందించారు.

బీఆర్ఎస్ బయటపెట్టడం కాంగ్రెస్ లేఖలు రాయడం..

చంద్రబాబు ఏజెంట్‌ను రేవంత్ రెడ్డి తన పక్కన పెట్టుకున్నారని, కాంగ్రెస్ నేతలంతా ఆంధ్రాకు కట్టుబానిసలుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదులలో

మిగతాది 2 లో..

ఏడాదిలో మార్పు లేకుంటే రాజీనామా చేయిస్తా!

సర్పంచ్‌లకు జేసీ ప్రభాకర్ రెడ్డి వార్నింగ్

యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపు

ప్రజా సమస్యల పరిష్కారమే సర్పంచ్‌ల బాధ్యత

నిధుల కంటే సేవాభావం ముఖ్యమని వ్యాఖ్య

ప్రజల్లోకి వెళ్లి మన్ననలు పొందాలని సూచన

వార్డుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు


2 లో

న్యూస్ డెస్క్, 24 నవంబర్ (ఇది కద నిజం): చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాలన్నదే తన ప్రయత్నమని తాడిపత్రి మాజీ మున్సిపల్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా కాకుండా సమాజంలో మార్పు తీసుకురావడానికి చేసే పోరాటంగా తాను భావిస్తానని పేర్కొన్నారు. కనీసం ప్రమాణ స్వీకారం కూడా చేయలేని వారిని నాయకులుగా ఎన్నుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

ఉక్రెయిన్ యుద్ధంలో 7 లక్షల మంది మృతి!



ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు భారీ ప్రాణనష్టం 2 లో

రోస్‌స్టాట్ డేటా ఆధారంగా మరణాల లెక్కింపు

2025, 2026 మరణాలు అధికారిక లెక్కల్లో లేవు

గల్లంతైన సైనికుల సంఖ్యపై ఆందోళన

మృతుల సంఖ్య 7 లక్షలకు పైగానే ఉంటుందని అంచనా

స్వతంత్ర సంస్థల విశ్లేషణలో వెల్లడైన యుద్ధ నష్టం

ఇందిరమ్మ చీరల పంపిణీకి ముహూర్తం ఫిక్స్!

26 నుంచి ఇందిరమ్మ చీరల పంపిణీ

కోటి మంది మహిళలకు కోటి చీరలు

అచ్చంపేటలో ప్రారంభించనున్న సీఎం

గ్రామీణ మహిళలకు 65 లక్షల చీరలు

పట్టణ మహిళలకు 35 లక్షల చీరలు

చిలుకపచ్చ రంగులో చీరల తయారీ

18 ఏళ్లు పైబడిన మహిళలకు అర్హత

రేషన్ కార్డు, ఆధార్‌తో చీరల పంపిణీ


2 లో

న్యూస్ డెస్క్, 24 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఇందిరమ్మ చీరలను కానుకగా అందించేందుకు సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు కోటి చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 26న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో సీఎం రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.

నేపాల్‌లో భూకంపం

ఐదు దేశాల్లో ప్రకంపనలు!



నేపాల్‌లో 5.3 తీవ్రతతో భూకంపం

భారత్‌లోని పలు రాష్ట్రాల్లో కంపించిన భూమి

ఉత్తర బెంగాల్ జిల్లాల్లో భూకంప ప్రభావం

ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన ప్రజలు

ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం నమోదు కాలేదు

అస్సోంలో మరో స్వల్ప భూకంపం 2 లో

శైవక్షేత్రాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు!

కార్తీక పౌర్ణమితో శైవక్షేత్రాల్లో భక్తుల సందడి

వేములవాడ రాజన్న క్షేత్రంలో ప్రత్యేక పూజలు

కొవ్వూరు గోష్పాద క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

బాపట్ల సూర్యలంక తీరంలో పుణ్యస్నానాలు

ధర్మపురిలో గోదావరి దీపాల వెలుగులు

కాళేశ్వరంలో ఘనంగా లింగోద్భవ పూజలు

శ్రీశైలం, శ్రీకాళహస్తిలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు



న్యూస్ డెస్క్, 24 నవంబర్ (ఇది కద నిజం): కార్తీక మాసం పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే ప్రముఖ శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. వేములవాడ, కాళేశ్వరం, కీసరగుట్ట, వేయిస్తంభాల గుడి, శ్రీశైలం, శ్రీకాళహస్తి, పంచారామ క్షేత్రాల్లో భక్తుల రద్దీ కనిపిస్తోంది. భక్తుల తాకిడికి అనుగుణంగా ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలైన్లు, దర్శన ఏర్పాట్లు చేశారు. ఇక, గోదావరి, కృష్ణా నదీ తీరాల్లో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి కార్తీక దీపాలను నదుల్లో వదులుతున్నారు. తులసి, ఉసిరి చెట్ల వద్ద మహిళలు 365 వత్తులతో దీపారాధనలు నిర్వహిస్తున్నారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతుండటంతో పుణ్యక్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగుతున్నాయి.

కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో భక్తుల సందడి

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని గోష్పాద క్షేత్రానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే గోదావరి నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి, కార్తీక దీపాలను నదిలో వదిలారు. అనంతరం సుందరేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామస్మరణతో క్షేత్రం మార్మోగింది. ఈ సందర్భంగా భక్తులు సాలిగ్రామ దానం, దీపదానం, స్వయంపాక దానాలు చేశారు. గోదావరి స్నానఘట్టాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు, ఫైర్ సిబ్బంది భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

2 లో

శ్రీవారి భక్తులకు టీటీడీ భరోసా

శ్రీవారి భక్తులకు రూ.2 లక్షల బీమా

యాత్ర సురక్ష స్కీమ్‌పై టీటీడీ సమీక్ష

ప్రమాద మృతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా

టీటీడీతో భాగస్వామ్యంపై ఎల్ఐసీ హర్షం

శబరిమల భక్తులకూ బీమా సదుపాయం

బాధిత కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ

యాత్రలో ప్రమాదాలకు బీమా రక్షణ 2 లో

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

బుధవారం 24-11-2026

కోమటిరెడ్డికి అధిష్టానం భరోసా!

మొదటి పేజీ తరువాయి

ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సూచన మేరకు గత రాత్రి ప్రజాభవన్ గెస్ట్ హౌస్‌లో బీఎం సందీప్‌తో ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఈ భేటీలో వారి అభిప్రాయాలను సావధానంగా విన్న సందీప్, అధిష్టానం ఆలోచనలను వారికి వివరించినట్లు సమాచారం.

త్వరలో మంచి భవిష్యత్:

మీపై పార్టీకి ఎంతో గౌరవం ఉందని, రానున్న రోజుల్లో మీకు మంచి బాధ్యతలు దక్కుతాయని కోమటిరెడ్డి, అనిరుధ్ రెడ్డికి సందీప్ భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని రాజగోపాల్ రెడ్డికి నచ్చజెప్పినట్లు సమాచారం. పార్టీలో ఏదైనా ఇబ్బంది ఉంటే నేరుగా తనకే చెప్పాలని, అధిష్టానంతో మాట్లాడాలనుకున్నా ఎలాంటి అభ్యంతరం లేదని సందీప్ స్పష్టం చేశారని, బయట బహిరంగ వ్యాఖ్యలు చేసి పార్టీకి నష్టం కలిగించవద్దని ఆయన సున్నితంగా సూచించినట్లు తెలిసింది.

నేపథ్యం ఇదే..

సొంత ప్రభుత్వంపై గత కొంత కాలంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిలు బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. కమిషన్లు ఇవ్వకుంటే పనులు జరగడం లేదని అనిరుధ్ రెడ్డి ఓపెన్ కామెంట్స్ చేయగా ముఖ్యమంత్రిపై కోమటిరెడ్డి సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. వీరి కామెంట్స్ పై ఇటీవల సిద్దిపేటలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘాటుగా రియాక్ట్ అయ్యారు. సీఎం చేసిన ఈ పరోక్ష వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో సంచలనం రేపాయి. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చకు దారితీయడంతో పాటు, నేతలు బహిరంగ విమర్శలకు దిగారు. ఈ నేపథ్యంలో వివాదాన్ని చక్కదిద్దేందుకు నూతన ఇన్‌ఛార్జ్ స్వయంగా రంగంలోకి దిగడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా భేటీతో ఈ అసంతృప్తి జ్వాలలు ఏ మేరకు సద్దుమణుగుతాయో వేచి చూడాలి.

నేపాల్‌లో భూకంపం.. ఐదు దేశాల్లో ప్రకంపనలు!

న్యూస్ డెస్క్, 24 నవంబర్ (ఇది కద నిజం): నేపాల్‌లోని కోషి ప్రావిన్స్ లేలెప్ సమీపంలో మంగళవారం ఉదయం 5.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. భారత కాలమానం ప్రకారం ఉదయం 7:02 గంటల ప్రాంతంలో ఈ ప్రకంపనలు చోటుచేసుకున్నట్లు యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ప్రాథమిక నివేదికలు వెల్లడించాయి. 27.855 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 87.909 డిగ్రీల తూర్పు రేఖాంశం వద్ద 20 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ పేర్కొంది. అయితే నేపాల్-టిబెట్ సరిహద్దుకు సమీపంలోని తాప్లెజంగ్ జిల్లా ఓలాంగ్‌చుంగ్ గోలా వద్ద 5.6 తీవ్రతతో భూకంపం నమోదైనట్లు నేపాల్ నేషనల్ ఎర్త్‌క్వేక్ మానిటరింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ తెలిపింది.

ఈ భూకంప ప్రభావం నేపాల్‌తో పాటు భారత్, భూటాన్, బంగ్లాదేశ్, చైనాలోని పలు ప్రాంతాలపై పడింది. భారత్‌లోని తూర్పు, ఈశాన్య రాష్ట్రాలైన బిహార్, మేఘాలయతో పాటు పశ్చిమ బెంగాల్‌లోని జల్పైగురి, అలీపుర్దువార్, కూచ్ బెహార్ తదితర ఉత్తర బెంగాల్ జిల్లాల్లో భూమి స్వల్పంగా కంపించింది. పశ్చిమ బెంగాల్‌లో బహుళ అంతస్తుల భవనాలు, ఇళ్లు, విద్యుత్ స్తంభాలు, తీగలు బలంగా ఊగడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఉదయం వాకింగ్, వ్యాయామం కోసం బయటకు వచ్చిన వారు సైతం ఒక్కసారిగా భూమి కంపించడంతో ఆందోళనకు గురయ్యారు.

అదృష్టవశాత్తూ ఇప్పటివరకు ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదు. మరోవైపు మంగళవారం తెల్లవారుజామున 3:39 గంటలకు అసోంలోని కార్బి ఆంగ్లాంగ్ జిల్లాలో 2.5 తీవ్రతతో మరో స్వల్ప భూకంపం సంభవించింది. 25.743 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 93.355 డిగ్రీల తూర్పు రేఖాంశం వద్ద భూమికి 15 కిలోమీటర్ల లోతులో దీని కేంద్రం ఉన్నట్లు ఎన్‌సీఎస్ అధికారులు వెల్లడించారు.

ఆసియాలో భారత్ ఆధిపత్యం!

గత ఏడాదితో పోలిస్తే భారత్ 0.5 పాయింట్లు మెరుగుపరుచుకోగా, చైనా 0.1 పాయింట్లు కోల్పోయి 73.6 వద్ద నిలిచింది. దీంతో సూచీ ప్రారంభమైన 2018 నాటి నుంచి ఇప్పటివరకు భారత్, చైనాల మధ్య ఉన్న శక్తి అంతరం అత్యల్ప స్థాయికి (0.6 పాయింట్లు తగ్గి) చేరుకుంది. 2018లో నాలుగో స్థానంలో ఉన్న భారత్, 2024లో తొలిసారి జపాన్‌ను అధిగమించి మూడో స్థానానికి చేరింది. 2025లో 40 పాయింట్ల మార్కును దాటి 'మేజర్ పవర్' జాబితాలో చేరిన భారత్, ఇప్పుడు తన ఆధిపత్యాన్ని మరింత విస్తరించుకుంది.

నాయకత్వంలో మోడీ జంప్..

ఆసియా ప్రాంతీయ నాయకత్వ ర్యాంకింగ్స్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఏకంగా మూడు స్థానాలు ఎగబాకి రెండో స్థానంలో నిలిచారు. 2025లో ఐదో స్థానంలో ఉన్న ఆయన, ఇప్పుడు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తర్వాత రెండో అత్యంత ప్రభావవంతమైన నేతగా గుర్తింపు పొందారు. ఆసియాలో భారత్ దౌత్య ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చూపిన సమర్థతకు నిపుణుల సర్వేలో అత్యధిక మార్కులు లభించాయి. అంతర్జాతీయ సదస్సులు, దౌత్య కూటములలో సభ్యత్వం పరంగానూ భారత్ 17 వేదికలలో ప్రాతినిధ్యం తో రెండు స్థానాలు ఎగబాకి ఉమ్మడి రెండో స్థానానికి చేరుకుంది.

పెట్టుబడుల స్వర్గధామంగా..

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్‌ఫ్లోస్ (2023-25 మధ్య మూడేళ్ల విదేశీ మూలధన పెట్టుబడులు) విభాగంలో భారత్ 273 బిలియన్ డాలర్లతో అమెరికా (718 బిలియన్ డాలర్లు) తర్వాత రెండో స్థానంలో నిలిచింది. ఈ విషయంలో చైనా (102 బిలియన్ డాలర్లు - 4వ స్థానం) కంటే భారత్ ఎంతో ముందుంది. అలాగే గత పదేళ్ల (2016-25) పెట్టుబడుల ఆకర్షణలోనూ భారత్ 581 బిలియన్ డాలర్లతో చైనా (506 బిలియన్ డాలర్లు)ను వెనక్కి నెట్టి రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఇతర దేశాల ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకునే సామర్థ్యంలో (జియో ఎకనామిక్ సెక్యూరిటీ) 68.3 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది.

సైనిక, శ్రామిక శక్తిలో నంబర్ వన్..

సైనిక సామర్థ్యం (ఆర్మ్‌డ్ ఫోర్సెస్) విభాగంలో భారత్ 100కి 100 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. చైనా (85.3), రష్యా (74.0), అమెరికా (64.8) దేశాలను అధిగమించింది. సైనికుల సంఖ్య, శిక్షణ, సన్నద్ధత, సమర్థవంతమైన నిర్వహణ ఆధారంగా ఈ ర్యాంకు దక్కింది. మరోవైపు 2050 నాటికి శ్రామిక శక్తి వనరుల (డెమోగ్రాఫిక్ రిసోర్సెస్) విభాగంలోనూ భారత్ 100కి 100 పాయింట్లతో ఏకైక అగ్రగామి దేశంగా నిలిచింది. చైనా (39.6), అమెరికా (33.2) భారత్ దరిదాపుల్లో కూడా లేకపోవడం భవిష్యత్తులో భారత ఆర్థిక వృద్ధికి ఉన్న అపార అవకాశాలను సూచిస్తోంది.

శ్రీవారి భక్తులకు టీటీడీ భరోసా

న్యూస్ డెస్క్, 24 నవంబర్ (ఇది కద నిజం): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రతకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పెద్దపీట వేస్తోంది. భక్తుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 'శ్రీవారి యాత్ర సురక్ష స్కీమ్'పై తిరుమల పద్మావతి అతిథిగృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. టీటీడీ ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఎల్ఐసీ ఛైర్మన్ దొరైస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అనుకోని ప్రమాదాల్లో బాధిత కుటుంబాలకు అండగా..

ఈ సందర్భంగా ఎల్ఐసీ ఛైర్మన్ దొరైస్వామి మాట్లాడుతూ.. టీటీడీతో ఎల్ఐసీ భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. యాత్రా సమయంలో భక్తులకు అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు వారి కుటుంబాలకు ఆర్థికంగా తోడుగా ఉండేందుకు టీటీడీ అత్యంత మానవీయ నిర్ణయం తీసుకుందని ప్రశంసించారు. 'శ్రీవారి యాత్ర సురక్ష స్కీమ్' కింద ప్రమాదవశాత్తూ మరణించిన భక్తుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున బీమా పరిహారం అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. తిరుమల తరహాలోనే శబరిమల అయ్యప్ప ఆలయానికి వచ్చే భక్తులకు కూడా బీమా సదుపాయం కల్పించాలని ఎల్ఐసీ నిర్ణయించినట్లు దొరైస్వామి వెల్లడించారు. అనంతరం ఇటీవల ప్రమాదాల్లో మరణించిన భక్తుల బాధిత కుటుంబాలకు టీటీడీ ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, ఎల్ఐసీ ఛైర్మన్ దొరైస్వామి చేతుల మీదుగా బీమా పరిహార చెక్కులను అందజేశారు.

జల జగడం కాంగ్రెస్‌పై గులాబీ గర్జన!

మొదటి పేజీ తరువాయి

సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రశ్నలు లేవనెత్తిన ప్రతిసారీ ప్రభుత్వం బ్యాక్ డేట్‌తో లేఖలు రాస్తోందని హరీశ్ రావు విమర్శించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలోనూ బీఆర్ఎస్ ఆధారాలతో ప్రశ్నించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకటి తేదీలతో ఉత్తరాలు రాసిందని, తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టిన అంశాన్ని తాము బయటపెట్టిన తర్వాత కూడా ఇదే తరహాలో వ్యవహరించిందన్నారు. ఇప్పుడు పల్నాడు ప్రాజెక్టు విషయంలోనూ పత్రికలు, కేటీఆర్ ప్రశ్నించడంతో మళ్లీ బ్యాక్ డేట్ ఉత్తరాల వ్యవహారానికి తెరలేపారని మండిపడ్డారు.

జీవో 56పై సీఎం వ్యాఖ్యలకు కౌంటర్

2022లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జీవో 56 వచ్చిందంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. ఆ జీవోలో ఎక్కడైనా నాగార్జునసాగర్ నుంచి నీటిని తరలిస్తామని పేర్కొన్నారా అని ప్రశ్నించారు. జీవో 56 కేవలం ఆర్థిక అనుమతులకు సంబంధించినదేనని స్పష్టం చేశారు. నాగార్జునసాగర్ నుంచి నీటిని తరలించే అంశం 2026 ఆగస్టులో విడుదలైన జీవో 453లో ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ఈ విషయంలో ఏం చేశారని నిలదీశారు.

పాలమూరుకు రేవంత్ ద్రోహం చేశారు

తల్లిపాలు తాగి రొమ్ము గుద్దినట్లు పాలమూరులో పుట్టి అదే జిల్లాకు రేవంత్ రెడ్డి ద్రోహం చేశారని హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. పాలమూరు జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోవడానికి సీఎం వైఖరే కారణమని ఆరోపించారు. 750 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పానికి కృష్ణా జలాలు వెళ్తున్నాయని, పక్కనే ఉన్న పాలమూరుకు మాత్రం ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టుకు సంబంధించిన పనులన్నీ సిద్ధం చేసి ఉంచినా మూడేళ్లలో మూడు కిలోమీటర్ల కాలువ కూడా తవ్వలేకపోయారని విమర్శించారు. ఈ మూడేళ్లలో ఒక్క కొత్త ప్రాజెక్టునైనా నిర్మించారా అని సీఎంను నిలదీశారు.

మేము అనుమతులు తెస్తే మీరు డీపీఆర్లు వెనక్కి..

బీఆర్ఎస్ హయాంలో అనేక ప్రాజెక్టులకు అనుమతులు తీసుకొస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వార్ధా ప్రాజెక్టు, కాళేశ్వరం అదనపు టీఎంసీ, సమ్మక్క సారలమ్మ ప్రాజెక్టుల డీపీఆర్‌లను వెనక్కి తీసుకుందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో పాలమూరులో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని, కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా కనీసం లక్ష ఎకరాలకైనా నీరు ఇచ్చిందా అని ప్రశ్నించారు. రూ.4 వేల కోట్లతో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చామని, ఎస్ఆర్ఎస్పీ కాలువల్లోనూ నీళ్లు పారించామని గుర్తుచేశారు. పాలమూరు జిల్లాను వలసల ప్రాంతంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించడం తప్పా అని ప్రశ్నించారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకురావడమే తప్పన్నట్లుగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం హోదాలో అబద్ధాలు చెబితే అవి నిజాలు అయిపోవని వ్యాఖ్యానించారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల లెక్కలు అడుగుతుంటే సీఎం ఫ్రస్ట్రేషన్‌లో మాట్లాడుతున్నారని విమర్శించారు.

ఉక్రెయిన్ యుద్ధంలో 7 లక్షల మంది మృతి!

న్యూస్ డెస్క్, 24 నవంబర్ (ఇది కద నిజం): ఉక్రెయిన్‌తో జరుగుతున్న భీకర యుద్ధంలో రష్యా భారీ స్థాయిలో ప్రాణనష్టాన్ని చవిచూసినట్లు సంచలన గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. ఈ యుద్ధంలో ఇప్పటివరకు సుమారు 7 లక్షల మంది రష్యా సైనికులు మరణించినట్లు మెడూజా, మీడియాజోనా అనే స్వతంత్ర వార్తా సంస్థలు వెల్లడించాయి. రష్యా ప్రభుత్వ గణాంకాల విభాగం 'రోస్‌స్టాట్' నుంచి లీకైన డేటాను విశ్లేషించి ఈ అంచనాకు వచ్చినట్లు ఆ సంస్థలు పేర్కొన్నాయి.

రష్యా అధికారిక డేటా ప్రకారం సెప్టెంబర్ నాటికి 4.9 లక్షల మంది సైనికులు మరణించినట్లు నమోదైంది. అయితే, 2025, 2026 సంవత్సరాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి మరణాలను అధికారిక జాబితాలో చేర్చలేదని సదరు స్వతంత్ర సంస్థలు తెలిపాయి. ఇదిలా ఉంటే యుద్ధభూమిలో గల్లంతైన సైనికుల సంఖ్యను కూడా కలుపుకుంటే, మొత్తం మృతుల సంఖ్య 7 లక్షలకు పైగానే ఉంటుందని మెడూజా, మీడియాజోనా తమ నివేదికలో స్పష్టం చేశాయి.

ఇందిరమ్మ చీరల పంపిణీకి ముహూర్తం ఫిక్స్!

మొదటి పేజీ తరువాయి

'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రెండోసారి మహిళలకు చీరలను అందిస్తోంది.

గ్రామీణ మహిళలకు 65 లక్షలు:

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని 65 లక్షల మంది మహిళలకు, పట్టణ ప్రాంతాల్లోని 35 లక్షల మంది మహిళలకు చీరలను పంపిణీ చేయనున్నారు. మహిళల అభిరుచులకు అనుగుణంగా ఆకర్షణీయమైన చిలుకపచ్చ రంగులో వీటిని ప్రత్యేకంగా రూపొందించారు. చీరల తయారీలో నాణ్యత, మన్నికకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆధునిక డిజైన్లతో పాటు సంప్రదాయ పద్ధతిలోనూ ధరించేందుకు వీలుగా రెండు రకాల చీరలను సిద్ధం చేశారు.

రెండు రకాల చీరలు.. ప్రత్యేక డిజైన్లు:

మొత్తం కోటి చీరల్లో 95 లక్షల పాలిస్టర్ చీరలు 6.30 మీటర్ల పొడవుతో ఉండగా.. మరో 5 లక్షల పాలీకాటన్ చీరలను 9 మీటర్ల పొడవుతో తయారు చేశారు. మహిళలకు నచ్చేలా ఆకర్షణీయమైన డిజైన్లతో వీటిని రూపొందించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నేత కార్మికులతోనే ఈ చీరలను తయారు చేయించారు. మహిళలకు కానుకగా చీరలు అందించడంతో పాటు స్థానిక నేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

ఎవరెవరు అర్హులు?:

రేషన్ కార్డు ఉన్న కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన మహిళలందరూ ఇందిరమ్మ చీరలు పొందేందుకు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైన మహిళలు తమ ఆహార భద్రత కార్డు, ఆధార్ వివరాలను చూపించి చీరలను పొందవచ్చు. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఇన్‌చార్జి మంత్రుల పర్యవేక్షణలో రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ కార్యక్రమం జరగనుంది. గ్రామాలు, పట్టణాల్లో వార్డుల వారీగా ప్రజాప్రతినిధుల సమక్షంలో సెర్ప్ సిబ్బంది చీరలను పంపిణీ చేయనున్నారు. పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించారు. ఇందులో లబ్ధిదారుల వివరాలను నమోదు చేయనున్నారు. ఈ నెల 26న అచ్చంపేటలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు అందనున్నాయి.

ఏడాదిలో మార్పు లేకుంటే రాజీనామా చేయిస్తా!

మొదటి పేజీ తరువాయి



తాడిపత్రి మున్సిపల్ కౌన్సిల్‌లోని 49 మందిలో 26 మంది బీటెక్, ఎంటెక్, డాక్టరేట్ చదివిన వారే ఉన్నారని తెలిపారు. తన కౌన్సిలర్లను చూసి గర్వపడుతున్నానని చెప్పారు. ఏడాదిలోగా మార్పు తీసుకురాలేకపోతే తమ సర్పంచులతో రాజీనామా చేయిస్తానని స్పష్టం చేశారు.

సర్పంచ్ అంటే ఉదయాన్నే వార్డుల్లోకి వెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరించాలని, కాలువలు శుభ్రం చేయించి, పరిసరాల్లో చెత్త లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వ నిధులపై మాత్రమే ఆధారపడకుండా గ్రామాలు, మున్సిపాలిటీల్లో సొంత వనరులను సృష్టించుకోవాలని అన్నారు. డబ్బు లేకపోయినా వార్డు మెంబర్ ప్రజలకు ఎంతో సేవ చేయగలరని, ప్రజాసేవకు కావాల్సింది డబ్బు కాదని.. ధైర్యం, ఆసక్తి అని పేర్కొన్నారు. దౌర్జన్యాలు చేయడం, వాహనాలు దహనం చేయడం, ఇంట్లో కూర్చుని నామినేషన్లు వేసే రోజులు పోయాయని జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. యూట్యూబ్‌ల ద్వారా ప్రచారం చేసుకోవడం కంటే ప్రజల్లోకి వెళ్లి వారి మన్ననలు పొందాలని సూచించారు. ప్రతి వార్డుకు సంబంధించిన ఏ టు జెడ్ సమాచారంతో పుస్తకాలు తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ వార్డు సమాచార పుస్తకాలను రాష్ట్రంలోని మేయర్లందరికీ పంపిస్తానని చెప్పారు. ప్రభుత్వం నిధులు ఇస్తుందని, వాటిని ఉపయోగించి ప్రజలకు మంచి చేయడం మాత్రం ప్రజాప్రతినిధుల చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించారు తాడిపత్రి మాజీ మున్సిపల్ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి..

శైవక్షేత్రాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు!

మొదటి పేజీ తరువాయి

బాపట్ల సూర్యలంక తీరానికి పోటెత్తిన భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా బాపట్ల జిల్లాలోని సూర్యలంక సముద్ర తీరానికి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. తెల్లవారుజాము నుంచే సముద్ర స్నానాలు ఆచరించారు. అనంతరం ఇసుకతో సైకత లింగాన్ని రూపొందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ధర్మపురిలో గోదావరి దీపాల వెలుగులు

జగిత్యాల జిల్లా ధర్మపురిలోని గోదావరి నదికి కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వేకువజామునే నదికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలను నదిలో వదిలారు. భక్తులు వదిలిన దీపాలతో గోదావరి నది దీపకాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోయింది. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలోనూ భక్తుల సందడి నెలకొంది.

కాళేశ్వరంలో ఘనంగా లింగోద్భవ పూజలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో వైకుంఠ చతుర్దశిని పురస్కరించుకుని శ్రీ ఆదిముక్తీశ్వర స్వామి ఆలయంలో లింగోద్భవ పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామివారికి లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, హారతి, మహామంత్ర పుష్పం, చతుర్వేద సేవ నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో భక్తులు స్వామివారికి మారేడు దళాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వైకుంఠ వత్తిని వెలిగించి భక్తిని చాటుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మహేష్, స్థానిక సర్పంచ్ మోహన్ రెడ్డి, ధర్మకర్తలు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

వేములవాడ రాజన్న క్షేత్రంలో కార్తీక శోభ

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి రాజన్నను దర్శించుకుంటున్నారు. కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. నేటి సాయంత్రం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో జ్వాలాతోరణం కార్యక్రమం నిర్వహించనున్నారు. జ్వాలాతోరణం గుండా స్వామివారు ప్రదక్షిణ చేయనుండటంతో ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే కార్తీక పౌర్ణమి వేడుకలతో వేములవాడ పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ప్రముఖ శైవక్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ శైవక్షేత్రాలైన శ్రీశైలం, శ్రీకాళహస్తి, కీసరగుట్ట, వేయిస్తంభాల గుడి, పంచారామ క్షేత్రాల్లోనూ భక్తుల రద్దీ కొనసాగుతోంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలైన్లు, దర్శన ఏర్పాట్లు చేపట్టారు. నదీ తీరాల్లో భద్రతా చర్యలను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలు, నదీ తీరాలు దీపాల కాంతులతో వెలిగిపోతుండగా.. భక్తులు శివనామస్మరణతో ఆధ్యాత్మిక ఆనందంలో మునిగితేలుతున్నారు.

అఖిలేశ్ లెక్కలు.. కాంగ్రెస్‌కు చిక్కులు!



న్యూస్ డెస్క్, 24 నవంబర్ (ఇది కద నిజం): మరోసారి అధికారం చేపట్టాలని యోగి ఆదిత్యానాథ్.. ఎలాగైనా యోగిని గద్దె దింపాలని ఎస్పీ-కాంగ్రెస్ ప్లాన్.. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు-2027 నేపథ్యంలో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య పొత్తు చర్చలు వేగం పుంజుకున్నాయి. సీట్ల పంపకాలపై రెండు పార్టీల నేతలు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు 26 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని ఎస్పీ ప్రతిపాదించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.. అయితే ఈ ప్రతిపాదనను కాంగ్రెస్‌కు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది..

26 స్థానాలతో ఎస్పీ ప్రతిపాదన

సోమవారం రోజు ఎస్పీ, కాంగ్రెస్ నేతల మధ్య తొలి సమావేశం జరిగింది. సుమారు 20 నిమిషాల పాటు సాగిన ఈ భేటీతో సీట్ల పంపకాల చర్చలకు ఊపొచ్చింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన రాంపూర్ ఖాస్, ఫరెండా స్థానాలతో పాటు రెండో స్థానంలో నిలిచిన మథుర, ఖైరాగఢ్, జగదీశ్‌పూర్, కిద్వాయ్ నగర్ నియోజకవర్గాలను కూడా ప్రతిపాదిత జాబితాలో చేర్చినట్లు సమాచారం. మిగిలిన 20 స్థానాలు ఉత్తరప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఎస్పీ రాజ్యసభ సభ్యుడు రామ్ గోపాల్ యాదవ్ ఈ చర్చలపై స్పందించారు. సమావేశంలో చెప్పాల్సిన విషయాలన్నీ చెప్పామని, కాంగ్రెస్‌కు తమ 26 స్థానాలను ఇచ్చామని పేర్కొన్నారు. మంగళవారం కూడా మరోసారి చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు. చర్చలు ముందుకు సాగుతున్న కొద్దీ కాంగ్రెస్‌కు కేటాయించే స్థానాల సంఖ్య పెరిగే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

120 స్థానాలతో కాంగ్రెస్ జాబితా

మరోవైపు కాంగ్రెస్ పార్టీ 120 అసెంబ్లీ నియోజకవర్గాలతో కూడిన జాబితాను ఎస్పీకి అందించినట్లు సమాచారం. ఈ జాబితాను మూడు కేటగిరీలుగా విభజించినట్లు తెలుస్తోంది. కేటగిరీ-ఏలో 55 స్థానాలను చేర్చారు. వీటిలో కాంగ్రెస్ గట్టిగా పోటీ చేయాలని భావిస్తోంది. కేటగిరీ-బీలో గతంలో మంచి ఫలితాలు సాధించిన నియోజకవర్గాలు ఉండగా, కేటగిరీ-సీలో గెలుపు అవకాశాలు ఉన్న స్థానాలను చేర్చినట్లు సమాచారం. ఈ జాబితాపై ఎస్పీతో చర్చలు జరగనున్నాయి.

181 స్థానాలపై కూడా కాంగ్రెస్ కన్ను

ఇంతకుముందు కాంగ్రెస్ పార్టీ 181 అసెంబ్లీ స్థానాల పేర్లను సీట్ల పంపకాల పరిశీలన కోసం ఎస్పీకి అందించినట్లు వార్తలు వచ్చాయి. ఇందులో 135 జనరల్ స్థానాలు, 45 ఎస్సీ రిజర్వుడు స్థానాలు, ఒక ఎస్టీ రిజర్వుడు స్థానం ఉన్నాయి. సీట్ల పంపకాల్లో ఎక్కువ స్థానాలు దక్కించుకోవాలని కాంగ్రెస్ భావిస్తున్నప్పటికీ, అన్ని స్థానాలను ఎస్పీ కేటాయించే అవకాశం లేదని రాజకీయ విశ్లేషణలు వెలువడుతున్నాయి.

60 నుంచి 70 సీట్లకే ఎస్పీ మొగ్గు?

కాంగ్రెస్‌కు 60 నుంచి 70 స్థానాలు కేటాయిస్తే సరిపోతుందని పలువురు ఎస్పీ నేతలు అ

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 25-11-2026

కార్తీక పౌర్ణమి సందర్భంగా యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తజనం

సుమారు 70 వేల మంది భక్తులకు శ్రీ స్వామివారి దర్శనం

2,410 శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాలు నిర్వహణ

వైభవంగా అన్నకూటోత్సవం, ఆకాశదీపం, కార్తీక దీపారాధనలు



ఇది కద నిజం ,యాదగిరిగుట్ట, నవంబర్ 24: కార్తీక మాసంలో అత్యంత విశిష్టమైన పర్వదినమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానానికి ఈరోజు భక్తులు ఊహించిన విధంగానే అధిక సంఖ్యలో విచ్చేశారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. సుమారు 70,000 మంది భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి దేవస్థానం అధికారులు పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించారు. గత సంవత్సర అనుభవాలు, ప్రస్తుత కార్తీక మాసంలో శని, ఆదివారాలు మరియు సెలవు దినాలలో ఏర్పడిన భక్తుల రద్దీని పరిగణనలోకి తీసుకొని పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. దీంతో అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసినప్పటికీ వ్రతాలు, దర్శనాలు మరియు ఇతర ధార్మిక కార్యక్రమాలు సజావుగా నిర్వహించబడ్డాయి.

గత సంవత్సరం కంటే అధికంగా శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని ముందుగానే అంచనా వేసిన దేవస్థానం అధికారులు భక్తులకు సకాలంలో వ్రతాలు నిర్వహించుకునే అవకాశం కల్పించేందుకు ఉదయం 4.00 గంటల నుండే శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాలను ప్రారంభించారు. సాధారణ బ్యాచ్ విధానానికి పరిమితం కాకుండా భక్తుల రద్దీకి అనుగుణంగా రెండు హాళ్లను బ్యాచ్ సమయముతో కాకుండా రద్దీ మేరకు వ్రతాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గత సంవత్సరం ప్రధాన ఆలయం మరియు పాతగుట్ట దేవస్థానంలో కలిపి మొత్తం 2,266 శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాలు నిర్వహించగా, ఈ సంవత్సరం మంగళ వారము అయినప్పటికీ ప్రధాన ఆలయంలో 2,150 వ్రతాలు, పాతగుట్ట ఆలయం 260 వ్రతాలు నిర్వహించడం జరిగింది. రెండు కలిపి మొత్తం 2,410 వ్రతాలు నిర్వహించబడ్డాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 144 వ్రతాలు అధికంగా నిర్వహించబడ్డాయి. వ్రతాలకు అవసరమైన పూజా సామాగ్రి మరియు ఇతర సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయడంతో పాటు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిబ్బందిని అందుబాటులో ఉంచారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాలను ఆచరించి అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్నారు.

సుమారు 70 వేల మంది భక్తులకు శ్రీ స్వామివారి దర్శనం

కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకునేందుకు సుమారు 70,000 మంది భక్తులు యాదగిరిగుట్టకు విచ్చేశారు. వీరిలో 1,400 మంది భక్తులు బ్రేక్ దర్శనం ద్వారా, 8,000 మంది భక్తులు ప్రత్యేక దర్శనం ద్వారా, మిగిలిన 60,600 మంది భక్తులు ధర్మదర్శనం ద్వారా శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన క్యూలైన్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది సమన్వయం వంటి అంశాలపై దేవస్థానం అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టారు.

ప్రధాన ఆలయంతో పాటు శివాలయంలోనూ భక్తుల ప్రత్యేక పూజలు

శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దర్శనం అనంతరం భక్తులు కొండపైన ఉన్న శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయాన్ని కూడా దర్శించుకున్నారు. కార్తీక మాస విశిష్టతను పురస్కరించుకొని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటూ భక్తులు తమ ఆధ్యాత్మిక యాత్రను కొనసాగించారు. కొండపైన మాడవీధులలో శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ప్రధాన ఆలయానికి ఎదురుగా ఏర్పాటు చేసిన కార్తీక దీపం, అఖండ దీపం వద్ద భక్తులు దీపాలను వెలిగించారు. అదేవిధంగా శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయం వద్ద కూడా కార్తీక దీపాలను వెలిగించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. రెండు ఆలయాలను దర్శించుకొని దీపారాధనలో పాల్గొనడంతో భక్తులు తమ యాత్రను సంపూర్ణం చేసుకున్నారు.

వైభవంగా శ్రీ స్వామివారి అన్నకూటోత్సవ మహోత్సవం

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మధ్యాహ్నం 12.00 గంటల నుండి 2.00 గంటల వరకు శ్రీ లక్ష్మీనరసింహస్వామివారికి అత్యంత వైభవంగా అన్నకూటోత్సవ మహోత్సవం నిర్వహించబడింది. ఆలయ సంప్రదాయాలు, ఆగమ శాస్త్ర విధానాల ప్రకారం ఈ విశేష ధార్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నకూటోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీని నియంత్రించడం మరియు కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించడం దృష్ట్యా మధ్యాహ్నం 12.00 గంటల నుండి 2.00 గంటల వరకు రెండు గంటలపాటు అన్ని రకాల దర్శనాలను, వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. కార్యక్రమం పూర్తయిన వెంటనే దర్శనాలను పునఃప్రారంభించి భక్తులకు స్వామివారి దర్శన సౌకర్యం కల్పించారు.

క్యూలైన్లపై నిరంతర పర్యవేక్షణ -- సమన్వయంతో త్వరితగతిన దర్శనాలు

అన్నకూటోత్సవం అనంతరం దర్శనాలు పునఃప్రారంభమైన నేపథ్యంలో భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని దేవస్థానం అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చర్యలు చేపట్టారు. అన్ని క్యూలైన్లలో దేవస్థానం సిబ్బంది, భద్రతా సిబ్బందిని నిరంతరం అందుబాటులో ఉంచి భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించారు. క్యూలైన్ మానిటరింగ్ వ్యవస్థ ద్వారా క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సంబంధిత సిబ్బందికి తగిన సూచనలు అందించారు. దేవస్థానం ఆలయ సిబ్బంది, భద్రతా సిబ్బంది పరస్పర సమన్వయంతో క్యూలైన్లలో రద్దీని ఎప్పటికప్పుడు నియంత్రిస్తూ, ఎక్కువ సమయం వేచి ఉన్న భక్తులకు వీలైనంత త్వరగా స్వామివారి దర్శనం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ దర్శన ప్రక్రియ సజావుగా కొనసాగేలా చర్యలు చేపట్టారు.

దేవస్థానం భద్రతా సిబ్బంది, స్థానిక ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో వాహనాల నియంత్రణ

అన్నకూటోత్సవం సందర్భంగా దర్శనాలతో పాటు వాహనాల రాకపోకలను కూడా రెండు గంటలపాటు తాత్కాలికంగా నిలుపుదల చేయడం జరిగింది. అనంతరం భక్తుల రాకపోకలు, వాహనాల రద్దీ పెరిగిన నేపథ్యంలో దేవస్థానం భద్రతా సిబ్బంది స్థానిక ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం, ఆలయ పరిసరాల్లో రద్దీ ఏర్పడకుండా చూడడం, భక్తులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా పర్యవేక్షించడం వంటి చర్యలు చేపట్టారు. దీంతో అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసినప్పటికీ ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ నిర్వహణను సమర్థవంతంగా కొనసాగించారు.

వైభవంగా ఆకాశదీపం -- రెండు ఆలయాల్లో కార్తీక దీపారాధనలు

కార్తీక పౌర్ణమి పర్వదినంలో అత్యంత విశిష్టమైన కార్యక్రమాలలో భాగంగా సాయంత్రం 6.30 గంటలకు ఆకాశదీప కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన ఆలయమైన లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో మరియు పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేకంగా దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఆకాశ దీపం కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాణా అధికారి మరియు బోర్డు సభ్యులు గుండా మల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు దీపకాంతులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు దీప ప్రమిదలను వెలిగిస్తూ భక్తిపారవశ్యంలో పాల్గొన్నారు. స్వామివార్ల అనుగ్రహం కలగాలని ప్రార్థిస్తూ తమ మొక్కులు చెల్లించుకున్నారు. రెండు ఆలయాల్లో నిర్వహించిన దీపారాధన కార్యక్రమాలు భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన వివిధ ధార్మిక కార్యక్రమాలలో దేవస్థానం కార్యనిర్వహణాధికారితో పాటు ధర్మకర్తల మండలి సభ్యులు విజయరాజం , మల్లయ్య పాల్గొన్నారు.



ఉదయం నుండే క్షేత్రస్థాయిలో కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణ

కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఉదయం నుండే క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ముఖ్యంగా శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రత మండపాలను సందర్శించి వ్రతాల నిర్వహణ తీరును, భక్తులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. అనంతరం దర్శన క్యూలైన్ల వద్దకు వెళ్లి భక్తుల రద్దీ, క్యూలైన్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న దేవస్థానం అధికారులు, ఆలయ సిబ్బంది, భద్రతా సిబ్బందికి ఎప్పటికప్పుడు తగిన సూచనలు జారీ చేస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన చోట సిబ్బందిని వినియోగించుకోవడం, క్యూలైన్లలో రద్దీని నియంత్రించడం, దర్శన ప్రక్రియను వేగవంతం చేయడం, ఆలయ పరిసరాల్లో భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మొత్తంగా, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి సుమారు 70,000 మంది స్వామివారిని దర్శించుకోగా, రెండు కలిపి 2,410 శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాలు నిర్వహించబడ్డాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 144 వ్రతాలు అధికంగా నిర్వహించబడ్డాయి. దేవస్థానం అధికారులు చేపట్టిన ముందస్తు ప్రణాళిక, కార్యనిర్వహణాధికారి గారి ప్రత్యక్ష పర్యవేక్షణ, ఆలయ సిబ్బంది, భద్రతా సిబ్బంది మరియు స్థానిక ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో కార్తీక పౌర్ణమి పర్వదిన వేడుకలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించబడ్డాయి.

గౌరారం లో అంగరంగ వైభవంగా కార్తీక పౌర్ణమి దీపోత్సవం

ఇది కద నిజం, నవంబర్ 24 ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గౌరారం గ్రామంలోని హనుమాన్ మందిరం వద్ద దీపోత్సవ వేడుకలను గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు, చిన్నారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపజ్యోతులను వెలిగించి అందంగా అలంకరించారు. దీపాల వెలుగులతో హనుమాన్ మందిరం పరిసర ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తి భావంతో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, దీపారాధనతో కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ముగించారు. ఈ వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మికతను, భక్తిభావాన్ని చాటిచెప్పాయి.



గౌరారం గ్రామంలో ఇంటింటిలో కార్తీక పౌర్ణమి దీపోత్సవం

ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గౌరారం గ్రామంలోని హనుమాన్ మందిరం వద్ద దీపోత్సవ వేడుకలను గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు, చిన్నారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపజ్యోతులను వెలిగించి అందంగా అలంకరించారు. దీపాల వెలుగులతో హనుమాన్ మందిరం పరిసర ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.





భక్తి భావంతో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, దీపారాధనతో కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ముగించారు. ఈ వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మికతను, భక్తిభావాన్ని చాటిచెప్పాయి.

హైదరాబాద్ అభివృద్ధి అంటే కేవలం భవనాలు, ఫ్లైఓవర్లు కాదు

ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి: ఆకాష్ కొల్లూరు

నానక్‌రామ్‌గూడ నుంచి పాతబస్తీ వరకు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అవసరం

రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలపై ప్రభుత్వానికి ప్రశ్నలు

ఇది కద నిజం ,చార్మినార్: హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న నగరంగా గుర్తింపు పొందుతున్నప్పటికీ, నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు ఇప్పటికీ కనీస మౌలిక వసతుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాష్ కొల్లూరు పేర్కొన్నారు. నగర అభివృద్ధి అంటే కేవలం ఎత్తైన భవనాలు, ఐటీ కంపెనీలు, ఫ్లైఓవర్ల నిర్మాణం మాత్రమే కాదని, ప్రతి కాలనీలో నాణ్యమైన రహదారులు, సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం, తాగునీరు, మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ముఖ్యంగా నానక్‌రామ్‌గూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా, భారీ నిర్మాణాలు, వాణిజ్య కార్యకలాపాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. నానక్‌రామ్‌గూడ ప్రాంతానికి సంబంధించి రహదారులు, వర్షపు నీటి కాలువలు (స్టార్మ్ వాటర్ డ్రైనేజీ), మురుగునీటి పారుదల, నాలాల అనుసంధానం, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలపై సమగ్ర డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపీఆర్) రూపొందించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆమోదించిన ప్రణాళికలు, నిధుల కేటాయింపులు, టెండర్లు, పనుల పురోగతిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. నగరంలోని దెబ్బతిన్న రహదారులకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని, వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి శాస్త్రీయంగా స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే చెత్త నిర్వహణను మెరుగుపరచడం, చెరువులు మరియు నాలాల సహజ ప్రవాహ మార్గాలను పరిరక్షించడం, ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడం, ఫుట్‌పాత్‌లు, వీధి దీపాలు, ప్రజా మరుగుదొడ్లు వంటి ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరచాలని పేర్కొన్నారు. GHMC, HMDA, HYDRAA, నవీఔూదీ తదితర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి నగరంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ సమగ్ర పట్టణాభివృద్ధి ప్రణాళికను అమలు చేయాలని ఆకాష్ కొల్లూరు విజ్ఞప్తి చేశారు. పాతబస్తీ నుంచి ఐటీ కారిడార్ వరకు, నగర కేంద్రం నుంచి శివారు ప్రాంతాల వరకు అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలని అన్నారు. ఈ సందర్భంగా చార్మినార్‌లో నిర్వహించిన సమావేశానికి రాధాకృష్ణ నిర్వాహకుడిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు పాల్గొన్నారు. వారిలో డాక్టర్ రఘు (కోరుట్ల అసెంబ్లీ ఇన్‌చార్జి), సయ్యద్ మతీన్ (నాంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి), మీర్ హమీద్ అలీ (మలక్‌పేట్ అసెంబ్లీ ఇన్‌చార్జి), మహేందర్ భండారి (సికింద్రాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి), టి. పరమేశ్వరి (బహదూర్‌పురా అసెంబ్లీ ఇన్‌చార్జి), హలీమా బేగం (ఖైరతాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి), రాకేష్ గైక్వాడ్ (సోను – GHMC జనరల్ సెక్రటరీ), రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.”హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా ప్రచారం చేయడం మాత్రమే కాదు.. ఇక్కడ నివసించే ప్రతి ఒక్కరికీ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులు కల్పించాలి. ప్రజలు చెల్లించే పన్నులకు తగిన సౌకర్యాలు అందించాలి. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం మా బాధ్యత” అని ఆకాష్ కొల్లూరు స్పష్టం చేశారు.



Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 25-11-2026

వెంకట సాయి నగర్ కాలనీలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలి

ఇంజినీరింగ్ శాఖ చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆటంకాలు కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని ఉప్పల్ సీఐకి కాలనీ వాసుల ఫిర్యాదు

ఇది కద నిజం ,హైదరాబాద్, నవంబర్ 24: రామంతాపూర్ భగాయత్‌లోని వెంకట సాయి నగర్ కాలనీలో ఇంజినీరింగ్ శాఖ అధికారులు చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, ఈ విషయంలో కాలనీలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరారు. కాలనీలో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత ఇంజినీరింగ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం రోడ్ల లెవెల్స్ నిర్ణయించి సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారని కాలనీ వాసులు తెలిపారు. అయితే, కె. నవీన్ కుమార్ అనే వ్యక్తి ఈ అభివృద్ధి పనులకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పనులకు ఆటంకాలు కలిగిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపించారు. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రజా ప్రయోజనాల కోసం చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులను అడ్డుకోవడం వల్ల కాలనీలో అభివృద్ధి పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడటమే కాకుండా, స్థానిక ప్రజలకు రాకపోకల విషయంలో ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రశ్నించిన కాలనీ వాసులపై డయల్ 100కు ఫోన్ చేసి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, దీంతో కాలనీలో అనవసర ఉద్రిక్తతలు నెలకొనే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వెంకట సాయి నగర్ కాలనీ అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మరియు కాలనీ వాసులు కలిసి ఉప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. రామలింగారెడ్డిని కలిసి ఫిర్యాదు అందజేశారు. ఇంజినీరింగ్ శాఖ అధికారులు నిబంధనల ప్రకారం చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, వ్యక్తిగత అభ్యంతరాల పేరుతో ప్రజా అభివృద్ధి పనులను అడ్డుకుంటూ కాలనీలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో ప్రజలందరికీ ఉపయోగపడే అభివృద్ధి పనుల విషయంలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను సంప్రదించి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించవద్దని కాలనీ సభ్యులు స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణ పనుల విషయంలో అధికారుల నిర్ణయాలను గౌరవిస్తూ, కాలనీలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదును స్వీకరించిన ఉప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. రామలింగారెడ్డి కాలనీ వాసులతో మాట్లాడుతూ, వెంకట సాయి నగర్ కాలనీలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపడతామని, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆటంకాలు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రజా ప్రయోజనాల కోసం ఇంజినీరింగ్ శాఖ చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగి పూర్తయ్యేలా సంబంధిత అధికారులు, పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కాలనీ అధ్యక్షుడు ఏ.విజయేందర్ రెడ్డి, కాలనీ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో కాలనీ జనరల్ సెక్రెటరీ అశోక్ , ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివ, కాలనీ సభ్యులు లక్ష్మి,మహేష్ గౌడ్, చిటికెల శ్రీనివాస్, పశ్యయం నరసింహ, చిటికెల వెంకట స్వామి, వెంకటరమణ, జంగయ్య, రమేష్, అనిల్, నేరడి శేఖర్, వెంకటేష్, గణేష్, చిటికెలమహేష్ తదితరులు కాలనీ పాల్గొన్నారు



చదువులు కాదు.. ఎలా జీవించాలో నేర్పించండి!

విజయ్ కుమార్ నారమళ్ళ గురుదక్షిణ అధ్యక్షుడు

డిగ్రీలు కాదు.. సంస్కారం ముఖ్యం పిల్లలకు మానవత్వం, బాధ్యత, పెద్దల పట్ల గౌరవం నేర్పించాలి

కరీంనగర్, 24 నవంబర్ (ఇది కద నిజం): నేటి సమాజంలో పిల్లలు ఉన్నత చదువులు చదువుతున్నారు. డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులుగా ఎదగాలని తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటున్నారు. అందుకోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిస్తున్నారు. కానీ పిల్లలు ఎంత చదువుకున్నారు అనే దానికంటే.. వారు ఎలా జీవిస్తున్నారు? సమాజం పట్ల ఎంత బాధ్యతగా ఉంటున్నారు? ఎదుటివారి పట్ల ఎంత మానవత్వంతో వ్యవహరిస్తున్నారు? అన్నదే ఇప్పుడు ఆలోచించాల్సిన అసలైన విషయం.

డిగ్రీలు వస్తున్నాయి.. సంస్కారం ఎక్కడుంది?

చదువు మనిషికి ఉద్యోగాన్ని, ఉపాధిని ఇవ్వవచ్చు. కానీ సంస్కారం మనిషికి గౌరవాన్ని తెస్తుంది. ఎంతటి ఉన్నత స్థానానికి ఎదిగినా ఎదుటివారిని గౌరవించడం, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం, తప్పు చేస్తే తెలుసుకొని సరిదిద్దుకోవడం వంటి లక్షణాలు చిన్నప్పటి నుంచే అలవడాలి. చదువుతో పాటు మానవత్వం నేర్పించకపోతే సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎలా ఎదుగుతారు?

విద్యార్థుల్లో పెరుగుతున్న దాడుల ధోరణి.. కారణాలేమిటి?లిలిఇటీవల విద్యార్థులు చిన్న చిన్న విషయాలకే గొడవలకు దిగడం, దాడులకు పాల్పడడం, దొంగతనాలు చేయడం, మందలించిన వారిపైనే తిరగబడడం వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రతి విద్యార్థిని ఒకే విధంగా చూడలేం. అయితే ఇలాంటి ప్రవర్తన వెనుక కుటుంబ వాతావరణం, స్నేహితుల ప్రభావం, సామాజిక మాధ్యమాలు, క్రమశిక్షణ లోపం, భావోద్వేగాలను నియంత్రించలేకపోవడం వంటి అనేక కారణాలు ఉండవచ్చు. వీటిని గుర్తించి చిన్న వయసులోనే సరైన మార్గదర్శకత్వం అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

మందలిస్తే తప్పా.. మంచి మార్గం చూపితే నేరమా?

విద్యార్థులు తప్పు చేసినప్పుడు గురువులు మందలించి మంచి మార్గంలో నడిపించాలి. అయితే నేటి పరిస్థితుల్లో కొందరు తల్లిదండ్రులు పిల్లలను మందలించినా సహించలేకపోతున్నారు. మా పిల్లలకు చదువు రాకపోయినా పర్వాలేదు కానీ మందలించవద్దంటూ విద్యాసంస్థలకు వచ్చి చెబుతున్న సందర్భాలు ఉన్నాయి. తప్పును సరిదిద్దే ప్రయత్నాన్ని అవమానంగా భావించడం ఎంతవరకు సమంజసం? అదే సమయంలో గురువులు కూడా విద్యార్థులను అవమానించకుండా, హింసించకుండా ప్రేమతో, బాధ్యతతో మార్గనిర్దేశం చేయాలి.

పిల్లల భవిష్యత్తులో తల్లిదండ్రుల పాత్ర కీలకం!

పిల్లలకు ఖరీదైన దుస్తులు, సెల్‌ఫోన్లు, బైకులు, డబ్బులు ఇవ్వడం మాత్రమే తల్లిదండ్రుల బాధ్యత కాదు. సమయం కేటాయించి వారితో మాట్లాడాలి. మంచి చెడులను వివరించాలి. పెద్దలను గౌరవించడం, పేదలకు సహాయం చేయడం, ఇతరుల కష్టాన్ని అర్థం చేసుకోవడం, తప్పు చేసినప్పుడు క్షమాపణ చెప్పడం నేర్పించాలి. పిల్లలు ఏం చేస్తున్నారు? ఎవరితో స్నేహం చేస్తున్నారు? సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి విషయాలు చూస్తున్నారు? అనే అంశాలపై కూడా తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలి.

గురువులు తలుచుకుంటే సమాజానికి మంచి పౌరులను అందించగలరు!

విద్యాసంస్థలు కేవలం మార్కులు, ర్యాంకులు, ఫలితాలకే పరిమితం కాకూడదు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి, సమానత్వం, సహనం, మానవత్వం వంటి విలువలను పెంపొందించాలి. విద్యార్థి తప్పు చేసినప్పుడు శిక్షించడం కంటే ఆ తప్పు ఎందుకు జరిగిందో తెలుసుకొని సరిదిద్దే ప్రయత్నం చేయాలి. గురువులు, తల్లిదండ్రులు కలిసి పనిచేస్తేనే మంచి సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

సమాజానికి కావాల్సింది మార్కుల యంత్రాలు కాదు.. మంచి మనుషులు!

రేపటి సమాజాన్ని నడిపించేది నేటి బాలలే. వారు డాక్టర్లు, ఇంజనీర్లు, అధికారులు, రాజకీయ నాయకులు ఎవరైనా కావచ్చు. కానీ ముందుగా మంచి మనుషులుగా ఎదగాలి. అధికారం, హోదా, డబ్బు ఉన్నా మానవత్వం లేకపోతే ఆ చదువుకు అర్థం ఏముంటుంది? పక్కవాడి కష్టాన్ని పట్టించుకోని విద్యావంతుడి వల్ల సమాజానికి ప్రయోజనం ఏమిటి?

విజయ్ కుమార్ నారమళ్ళ, గురుదక్షిణ అధ్యక్షులు అభిప్రాయం ప్రకారం.. పిల్లలకు చదువుతో పాటు సంస్కారం, మానవత్వం, పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత నేర్పించడంపై తల్లిదండ్రులు, గురువులు, విద్యాసంస్థలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎందుకంటే చదువు మనిషికి జీవనోపాధిని చూపిస్తే.. సంస్కారం ఎలా జీవించాలో నేర్పిస్తుంది.



ఏదులాపురం అభివృద్ధికి మరో ముందడుగు రూ.2.70 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం

శ్రీ అభయ టౌన్‌షిప్ నుంచి గుర్రాలపాడు తండా వరకు రోడ్డు పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన.

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా - మంత్రి పొంగులేటి.

ఖమ్మం, 24 నవంబర్ (ఇది కద నిజం): ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. శ్రీ అభయ టౌన్‌షిప్ నుంచి గుర్రాలపాడు తండా వరకు రూ.2 కోట్ల 70 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సాయిప్రభాత్ నగర్ 1, 2, టెంపుల్ సిటీ, సింగరేణి కాలనీ, శ్రీ అభయ టౌన్‌షిప్ మీదుగా గుర్రాలపాడు తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ, ముందుకు సాగుతోందన్నారు. గత మూడు సంవత్సరాల్లో ఈ ప్రాంత అభివృద్ధి కోసం రూ.16 నుంచి 17 కోట్ల వరకు నిధులు కేటాయించామని, ఇప్పటికే కొన్ని పనులు పూర్తికాగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు.

స్థానిక కౌన్సిలర్లు కోరిన విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను కూడా ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో పలు గ్రామపంచాయతీలను కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు చేసినప్పటికీ, అనేక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరతతో ప్రజలు దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఇప్పటివరకు వివిధ పనులకు రూ.140 కోట్ల నిధులు మంజూరు చేసుకున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో విద్యుత్, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, మిగిలిన రోడ్లు, పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని వెల్లడించారు. ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, ప్రజల ఆశీర్వాదంతో వచ్చిన ప్రభుత్వంలో మీ పెద్ద కొడుకుగా, మీ శీనన్నగా ఆ బాధ్యతను నెరవేరుస్తానని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, పీఆర్ ఎస్ఈ జి. వెంకట్ రెడ్డి, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, మున్సిపల్ కమిషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, వివిధ డివిజన్ల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





బాలానగర్ ప్రజలను దోమల మధ్య వదిలేసిన కాంగ్రెస్ పాలన. ఆవుల రవీందర్ రెడ్డి



కూకట్ పల్లి, 24 నవంబర్ (ఇది కద నిజం): బాలానగర్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో ఫాగింగ్ నిర్వహించకపోవడంతో దోమల బెడద తీవ్రంగా పెరిగిపోయింది. ప్రజలు దోమలతో నిద్రలేని రాత్రులు గడుపుతూ, అనారోగ్య భయంతో ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులకు మాత్రం చీమకుట్టినట్టయినా లేదని బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.

ఫాగింగ్ నిర్వహించాలని అధికారులకు ఫోన్ చేసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా సరైన స్పందన రావడం లేదని, ఫాగింగ్‌కు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉందని అధికారులు సమాధానం చెబుతున్నారని ఆయన తెలిపారు.

ప్రభుత్వానికి బిల్లుల సమస్యలు ఉంటే ప్రజలు దోమల మధ్య బతకాలా? ప్రజల ఆరోగ్యం అధికారులకు, ప్రభుత్వానికి పట్టదా?

ప్రజలకు కనీస పారిశుద్ధ్య సేవలు అందించలేని పరిస్థితి ఎందుకు ఏర్పడిందని ఆయన ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడటం మానుకొని, వెంటనే ఫాగింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఆర్.ఆర్. నగర్‌లో రోడ్ వైడెనింగ్ పనులను పరిశీలించిన. ముద్దం నరసింహ యాదవ్



కూకట్ పల్లి, 24 నవంబర్ (ఇది కద నిజం): ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలోని ఆర్.ఆర్. నగర్‌లో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టనున్న ఎలక్ట్రికల్ పోల్స్ మార్పిడి, ఏర్పాటు పనులను మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ కాలనీవాసులు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మొత్తం నరసింహ యాదవ్ మాట్లాడుతూ

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, రోడ్డు విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, కాలనీలో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ చక్రపాణి, సెక్రటరీ ఎం శ్రీనివాస్ రావు, మీనాక్షి పవార్, బిట్ల వెంకటేశ్వర రావు, వీ కృష్ణ రెడ్డి, సందీప్ చక్రవర్తి, బాబు ఓన్నుని, కే సునీత, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు వీరారం విద్యార్థి



మరిపెడ, 24 నవంబర్ (ఇది కద నిజం): రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వీరారం గ్రామం లోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన మహీన్ కుమార్ ఎంపికయ్యారు.

జిల్లా స్థాయిలోజరిగిన ఇన్స్పైర్ ఆర్ఎస్ బీ వీ పి పోటీలలో జడ్పీఎస్ ఎస్ వీరారం కు చెందిన మహీన్ కుమార్ గ్రీన్ ఎనర్జీ విభాగం లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారూ అని పాఠశాల హెచ్ ఎం లక్ష్మీ నిర్మల తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సైన్స్ ఉపాధ్యాయులను ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మధు, మాచర్ల రవి, పి.జానకి,కె.నెహ్రూ,వి వెంకట్,పి అనిల్ కుమార్ వెంకన్న లు పాల్గొన్నారు.

తొర్రూరు మండలాన్ని కరువు మండలం గా ప్రకటించాలి

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

రైతులకు బ్యాంకు రుణాలు మాఫీ చేయాలి

సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుణగంటి రాజయ్య

తొర్రూరు, 24 నవంబర్ (ఇది కద నిజం): తొర్రూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయ చర్యలు కింద రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుణగంటి రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రోజు తోరూర్ మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆఫీస్ లో మార్క సాంబయ్య అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుణగంటి రాజయ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ, రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఉన్నటువంటి స్థితిలో మహబూబాబాద్ జిల్లా ఉన్న 18 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే నీటి ఎద్దడితో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఏడు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ఎంపిక చేశారని, అది శాస్త్రీయ పద్ధతిలో జరగలేదని వారు అన్నారు. ఇప్పటికైనా అధికారులు తోరూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని వారి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చినటువంటి పంటలకు ఇచ్చిన బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని వారు కోరారు. ఎండిపోయిన పంటలకు వరి కి ఎకరానికి 30 వేల రూపాయలు, వాణిజ్య పంటలకు ఎకరానికి 50 వేల రూపాయల నష్టపరిహారం ఇచ్చి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకోవాలని వారి సందర్భంగా ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు మొదలుపెట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని లేనియెడల రైతులందరికీ కలుపుకొని ఉద్యమానికి సిద్ధమవుతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ తొర్రూర్ మండల కార్యదర్శి ఎండి యాకూబ్, సోమిరెడ్డి, జమ్ముల శ్రీను, దొనక దుర్గయ్య, బోర స్వామి బొల్లం మమత తదితరులు పాల్గొన్నారు.